

# నన్ను గురించి కథ వ్రాయవూ?

"నన్ను గురించి కథ వ్రాయవూ?" అని అడిగింది కుముదం.

ఈ ప్రశ్న నాకు కొంత ఆశ్చర్యం కలగజేసింది. ఎందుకంటే కొద్ది మార్పుతో ఇదే ప్రశ్న ఎనిమిది సంవత్సరాల క్రితం అడిగింది. నాకు బాగా జ్ఞాపకం. మా మేనమామ గారింట్లో కుముదం తండ్రి కాపురం వుండేవాడు. అద్దె తీసుకురమ్మని అప్పుడప్పుడు నన్ను పంపేది మా అత్తయ్య. ఆ రోజు సాయంత్రం కర్రకు మేకు దిగేసి, ఇనుపచక్రం దొర్లించుకుంటూ దొడ్లో పరుగులెత్తింది కుముదం. నా కప్పుడు పన్నెండో ఏడు. ఆమె నాకంటె రెండు సంవత్సరాలు చిన్నదని వాళ్ళమ్మ నాకు చెప్పింది. నేను అద్దెమాట మరిచి కుముదంతో కబుర్లు చెబుతూ కూర్చుండేవాడిని. చెట్టెక్కి జామపండ్లు కోసిపెట్టమని వేధించుకుతినేది. పూర్తిగా పండని జామపండు రంగులా వుండేది ఆ పిల్ల ఛాయ. నేనేదో కల్పించి కథలకింద చెప్పేవాడిని. వీటిల్లో పాత్రలు మా వూళ్ళో యిరుగు పొరుగు అబ్బాయిలూ, అమ్మాయిలు. ఈ కబుర్లు అమాయకంగా చూస్తూ విన్నా, కుముదం కళ్ళల్లో ఎక్కడో ఈర్ష్య మసకగా మెదిలినట్లు భ్రమించి, నేను గర్వపడేవాడిని. అతిశయోక్తి కల్పన కథకుడి జన్మలక్షణం కాబోలు! యధార్థ విషయాలు మానేసి, కల్పిత గాథలను, యధార్థాలుగా చెప్పడం ఊహాసృష్టి లక్షణం అనుకుంటా. ఇవన్నీ కుముదం నమ్మినట్లుగానే కొంటెగా నిట్టూర్పు విడిచేది. నేనూ, యీ వ్యక్తులు, ఘట్టాలు యధార్థాలుగా స్మరించుకొని, తెచ్చిపెట్టుకున్న మౌనంలో పడేవాడిని. ఆ నిశ్శబ్దంలో కుముదం కంఠం వినిపించింది. "నన్ను గురించి కథ చెప్పవూ?" అంది. ఆ ప్రశ్న వెయ్యకపోతే, ఆమె కథ మరొకరి దగ్గర చెప్పివుందు నేమో నాకు తెలీదు. నే అనుకోడం ఆమె కథ ఎవరితోనూ చెప్పివుండను. ఎందుకంటే, ఆమె నిజంగా మనిషి – ఊహాలో వ్యక్తికాదు.

అదే ప్రశ్న మళ్ళా అడగడం నాకు ఆశ్చర్యం కలగజేసింది. ఐనా నేను కథలు వ్రాస్తానన్న సంగతి ఆమె కెట్లా తెలుసో నాకర్థంకాలేదు. నా కథలు, వొకటి రెండు తప్ప అచ్చుకాలేదు; వాటిని గురించి నే నెవ్వరితోనూ ముచ్చటించలేదు. ఇరవై సంవత్సరాల యువక అజ్ఞానంలో వున్న నన్ను ఎన్నుకోతగ్గ రచయితగా యీ సంఘం గుర్తించదని నా భయం. ముదుసలే జ్ఞాని కాగలడని భారతీయుల వెర్రి నమ్మకం. పెద్దలన్నా, ప్రాచీనులన్నా, పాతవిషయాలన్నా, మనవాళ్ళకి అంత గౌరవం. ఒక విషయం మంచిదా చెడ్డదా అన్న తార్కిక సంశయాలకి సంఘంలో అంతగా తావులేదు. ఎటొచ్చీ ఆ విషయాన్ని ప్రతిపాదించిన వ్యక్తి మృతుడై వుండాలి.

శక్తిగలవాళ్ళు ధనార్జనలోనూ, అది లేనివాళ్ళు దైవంలోను లీనమైన యీ దేశంలో కథకుడికి విలువలేదని నే నా రోజుల్లో నమ్మేవాడిని. నేను వ్రాసి తగల పెట్టిన రచనలతో

నాకు మరో దేశంలో బ్రహ్మరథం పడుదురు. సంఘం గుర్తించదన్న భయ మొకటేకాదు, నేను కథలు వ్రాయకపోవడానికి కారణం; నా రచనా విధానానికి పరిపక్వం రాలేదని కూడా నే లోపల అనుకునేవాడిని; నా సృష్టి శక్తుల్ని రగిల్చి నన్ను తన్మయుణ్ణిచేసి నా జీవితంపై వొత్తిడి కలిగించే వ్యక్తులుకాని, నా రచనల్ని చదివి, వాటిల్లోని లోతులకి దిగ్రాకి తాత్కాలికంగానైనా ధన్యతచెందే వ్యక్తులుకాని ఆనాటివరకూ లేరని నాకు తెలుసు. ప్రపంచాన్ని పరిశీలిస్తూ వ్యక్తుల మంచి చెడ్డలని, వింత ప్రవర్తనని ప్రేక్షకుడుగా అనుభవించి అర్థంచేసుకుని, అల్లా సంపాదించిన ఆంతరంగిక జ్ఞానాన్ని నా తాత్వికదృష్టిలో మేళవించి, వార్థక్యంలో మహత్తర గ్రంథం వ్రాసి, మరణించాలని నా ఆదర్శం. ఈ రెంటిలో వొకటైనా జరిగితీరుతుంది. మహత్తర గ్రంథం వ్రాయలేకపోవచ్చు; కాని మరణం మాత్రం తప్పదన్న ధైర్యం నాకో నూత్న వుత్సాహాన్ని ప్రసాదించింది. ఆ రోజుల్లో "నన్ను గురించి కథ వ్రాయవూ?" అనే ప్రశ్న స్త్రీ నోటినుండి వినడం అదే మొదటిసారి. తన వ్యక్తిత్వాన్ని గుర్తించుకుని, దాని ప్రభావాన్ని ఇతరులకి తెలియచెయ్యాలన్న స్త్రీని మొట్టమొదట కుముదంలో చూడగలిగాను. ఆమె వొక జీవి; ప్రత్యేకమైన వునికిగలది. ఆమెని తొలగిస్తే ప్రపంచంలో కొంత పవిత్రమైన ఖాళీ ఏర్పడుతుంది. నే చూసిన స్త్రీలు వివాహం జరిగిన రోజునే జన్మించినవాళ్ళు. భర్తని పొడిగిస్తే, స్త్రీ ఔతుంది; యింకా పొడిగిస్తే భర్త సంతానంగా మారతాడు; అతను గతించగానే ఆమె స్థూలజీవితం సమాప్తమౌతుంది. సృష్టిని ఆహ్వానిస్తూ తెరుచుకున్న తలుపులు మన స్త్రీలు. తెరుచుకోని తలుపులులేవు. ఏదైనా వొక తలుపు తెరుచుకోనివాడు, దాన్ని గురించి చెప్పుకొని, మరమ్మత్తు సంకల్పించాలి. మరమ్మత్తుచేసినా బాగుపడని తలుపులను నిర్మూలం చెయ్యాలా, లేక వేరే పనులకు వుపయోగించుకోవాలా అన్న సందేహాన్ని సంస్కర్తలు తీర్చాలి. కథకుడు, ఏం చెడిపోయిందో చెప్పగలడు; వీలైతే మిగిలినదానితోనే తృప్తిపడుతూ యితరులతో ఆ తృప్తిని పంచుకోగలడు; కాని బాగుచేసే విధానాలతో అతనికి నిమిత్తంలేదు.

"నీలో ఏముందని నిన్ను గురించి కథ వ్రాయనూ?" అన్నాను. అట్లా అన్నందుకు పశ్చాత్తాపపడినా, ఆ ప్రశ్న నా నమ్మకాన్ని, ఆశయాలనీ యధార్థంగా వ్యక్తపరుస్తుంది. ఆమెలో కథావస్తువుగా వుండేటంతటి విశేషం వొక్కటి కూడా లేదు. చూడడానికి చాలా సామాన్యంగా వుంటుంది; పల్చటి శరీరం; వేసంగిలో వర్షం కురిసేముందు దట్టంగా అల్లుకున్న మబ్బురంగు శరీరచ్ఛాయ; సంపూర్ణంగా వికసించని అవయవాలు; ఎవరో దువ్వినట్లుగా ఉండే జడకట్టు; చూసిన వస్తువులు తన కోసం కానట్టు చాంచల్యంగా కదిలే బలహీనమైన కనురెప్పలకింద మంచులో కదిలిపోయిన కుందేలులా మెరిసే నేత్రాలు; కంఠంలో కొలవడానికి వీలుగావుండే వచ్చటి నాళాలు; నీడ కనిపించినట్లు స్ఫురించే వక్షం; శరీరంలో పైభాగాన్ని మోసేటందుకు వోపికలేనట్టి అల్పమైన నడుం. కుముదం సాధారణమైన స్త్రీ. ఎవరూ - తుదకు వాళ్ళమ్మకూడ - ఆమె అందమైందని చెప్పుకోడం నే నెరగను. అందుకనే ఆమెలో నేనేమీ విశేషం చూడలేక పొయ్యానేమో!

"నాలో ఏముండాలి?"

"ఒక ప్రత్యేకత, అందరిలోనూ లేని ఏ వొక్క విశేషం అయినా సరే-"



వేలునున్న ఉంగరాన్ని చూచి దాన్ని వేళ్ళతో తిప్పింది. పోతపోసి పదును పెట్టినట్లుగా చలించే వేళ్లు ఆమెవి. ఏ అవయవం కదిలినా, శరీరంలోని శక్తంతా దానిలో పూరించినట్లుగా వుంటుంది. ఒక వొస్తువుకేసి చూస్తున్నప్పుడు, పంచప్రాణాలు కళ్లల్లోకి పరుగెత్తుకొచ్చినంత తీవ్రంగా చూస్తుంది. సిగ్గుపడితే రక్తం చెక్కిళ్ళలోనుంచి తొంగి చూస్తున్నట్లుంటుంది. కాని కుముదాన్ని వర్ణించినంతమాత్రాన కథౌతుందా?

"నీ పెండ్లికి నన్ను పిలవలేదేం?" అని అడిగాను.

"మా అమ్మ నీకూ శుభలేఖ పంపానంది - వొస్తే నలుగుర్నీ చూచి, ఏమన్నావుంటే కథేనా వ్రాద్దువుగా" అంది కుముదం. కళ్ళల్లోంచి పెదవుల మీదికి దిగజారిన నవ్వుని ప్రదర్శిస్తూ.

"నేను తమాషాకి అనడంలేదు. సాధారణ వ్యక్తులను గురించి వ్రాసేటందుకు ఏముంది? పదిమందీ ఒకేలాగున్నప్పుడు వారిలో ఏ ఒక్కర్నీ గురించి చెప్పుకోం. కాని, అందులో ఏ ఒక్కడైనా, పదిమంది చేసినదానికి వ్యతిరేకంగా చేస్తే అతన్ని గురించి చెప్పుకుంటారు. అట్లాంటి వ్యక్తులని గురించి వ్రాయొచ్చు" అన్నాను.

"అయితే అందరూ చేసినదానికి విరుద్ధంగా చేసేవాళ్లే మనుష్యులన్నమాట...."

"నే అల్లా అనను, అట్లాంటి వాళ్లు చెప్పుకోదగ్గ మనుషులంటాను."

ఎక్కడో ఎప్పుడో పుట్టడం, ఎవరో ఎవర్నో వొప్పగిస్తే వార్ని పెళ్ళాడడం. ఎందుకో తెలీకండా పిల్లల్ని కనడం, ఎప్పుడో ఎక్కడో చచ్చిపోవడం ఇది చాలామంది చేస్తున్నది. దీన్నీ గురించి కథగా చెప్పుకునేందుకు ఏముంది? ప్రత్యేకత, వ్యక్తిత్వం లేని యీ జీవితాలు ప్రశాంతాన్ని పొందుతున్నాయి; కాని, అది బురదగుంటలో పురుగు పొందే ప్రశాంతం. సంఘాన్ని ధిక్కరించి, సాంప్రదాయాలపై విప్లవం చేసి, యితరులకి అవగాహన కాని కొత్త విలువని సాధించి పొందినవాడే ధన్యజీవి. వ్యర్థజీవులు సంఘం అల్లిన వలలో చిక్కుకొని, మర్యాద పేరు చెప్పుకుని కుళ్ళిపోతారు. స్థాపితమైన ఆదర్శాలపై విప్లవం చేసినవాడు సంఘాన్ని తనవైపుకి మరల్చ యత్నిస్తారు. కాబట్టి సంఘాభివృద్ధి అల్లాంటి వాళ్ళపై ఆధారపడుతుంది. కుముదంలో ఈ విప్లవచిహ్నం వొక్కటి కూడా లేదు.

ఆమె చదువుకోలేదు; సంగీతం నేర్చుకోలేదు. కనీసం కూనిదీర్ఘాలు తీస్తుందని చెప్పుకోడమేనా నే నెరగను జ్ఞానం వొచ్చిం తర్వాత ప్రేమించి - చేసుకున్న పెండ్లి కాదు; గొప్ప స్థితిపరురాలు కాదు; పోనీ బాగా బీదదీకాదు, సానుభూతి చూపేటందుకేనా; చక్కందికాదు, పద్యాలు వ్రాద్దామంటే; అనాకారీకాదు, వికృతాన్ని ఆధునికుల ధోరణిలో చిత్రిద్దామంటే; మంచి వాళ్ళని గురించి వ్రాయొచ్చు; చెడ్డవాళ్ళని గురించి వ్రాయొచ్చు; కాని సాధారణమైనవాళ్ళని గురించి వ్రాయడం ఎంతో కష్టం. అసలు వ్రాసేటందుకు ఏముంది?

కొందరు వ్యక్తులు తల్లిదండ్రుల చర్యలవల్ల ఖ్యాతి కెక్కుతారు. కుముదం ఆ తెగకి చెందదు. వాళ్ళ తండ్రి చనిపొయ్యాడు. తల్లి ఏ వూళ్ళోనో కొడుకు దగ్గర వుంది. వాళ్ళ కుటుంబానికి చరిత్ర లేదు.

"మీ ఆయన ఏం చేస్తున్నాడు?"

"ఎల్.టి. చదువుతున్నారు."

"స్కూల్ మాస్టరవుతాడన్నమాట - ఏ పనీ దొరకనివారికి అదే శరణు. మంచివాడేనా?"

నవ్వింది. "మంచి అంటే ఏమిటో నాకేం తెలుసు? నీకు తెలియాలి, కథలు రాసేవాడవు."

"ఓస్! చెప్పడం కాబోలు. అది కాదు కుముదం. అందర్లాగే కాపరాని కెళ్ళి పిల్లల్నికంటే ఏం ప్రయోజనం? ఏదో వో గొప్పకార్యం సాధించాలి; సంఘాన్ని ముందుకు నెట్టాలి. ఇక్కడికే భారతమాత యీ సంతానాన్ని పోషించలేకపోతోంది."

"నా కింకా పిల్లలులేరు. అయితే ప్రతి ఆడదీ పెండ్లి చేసుకోకుండా, పెళ్ళిపందిళ్ళలో పికెటింగ్ చెయ్యాలంటావా?"

"పెళ్ళి వొద్దని నే ననడంలేదు. వివాహం స్త్రీ జీవితంలో ప్రధానఘట్టం అందులో నువ్వు సాధించింది ఏముంది? ప్రేమా? సౌఖ్యమా? ఆధ్యాత్మికమా? దేశభక్తా? ఏదీలేదు."

"పెండ్లి చేసుకున్న ప్రతి స్త్రీ భర్తను వొదిలేస్తే నువ్వు కథలు వ్రాస్తానంటావ్. అంతేనా?"

అంత పచ్చిగా అడిగినందుకు నాకు రోషం వొచ్చింది.

"వొదిలేస్తే చాలదు - మరో గొప్ప విలువని సాధించాలి."

"అంటే?"

"ప్రేమలేని వివాహానికి విలువలేదనుకుంటాను."

"నీకేం తెలుస్తుంది? నీకు పెళ్ళికాలేదు."

"ఆ విలువని సాధించగల్గితేనే వివాహానికి అర్థం వుంటుంది."

"అట్లాగైతే, ప్రతి స్త్రీ భర్తను వొదిలేసి మరోడితో వుండాలందూ, ప్రేమను సాధించేందుకు?"

అట్లా అడిగినందుకు నాకు నవ్వొచ్చింది. "దానికోసం ఆ త్యాగం చెయ్యగలిగితేనే మెచ్చుగుంటాను" అన్నాను.

కుముదం మాట్లాడలేదు. ఈ భావాలు ఎంతవరకూ ఆమెని కలవరపెట్టాయో నాకు తెలీదు. స్త్రీ ప్రకృతిపైన వొత్తిడి కలిగించేది భావాలో సహజమైన ఉద్రేకమో నేను చెప్పలేను. అది తెలిస్తే స్త్రీ హృదయం అర్థంచేసుకున్నట్లే.

"కాని....కాని...." మాటలకోసం తడుముకుంటూ నిదానించింది,

"ఏమిటి నీ సందేహం?"

"ఏమీలేదు. నాకేదో చెప్పాలనుంది. ఎట్లా చెప్పాలో తెలీడంలేదు. నే చదువుకున్న దాన్నికాదు. ఉండు, ఆలోచించనీ...."

నేను ఆమె కళ్ళకేసి చూస్తూ కూర్చున్నాను. నిదానించి చూస్తే ఆమె మొహంలో వొకవింత ఆకర్షణవుంది. ఆమె శరీరంలో వొంపులు, ఎత్తు పల్లాలు సూర్యరశ్మి సోకినప్పుడు తీర్చినట్లుగా విప్పారుకున్నాయి. అ కళ్లు ఆమెకి వుపయోగంలేవు కాబోలు; మనుషులకి ఆత్మ వుందో లేదో నాకు తెలీదు కాని, ఆమెకి మాత్రం లేనట్లు నా కనిపించింది.



మరోలోకంలో ఆత్మని మరచిపోయి, శరీరాన్ని తనిష్టం లేకుండానే ఇక్కడికి రప్పించినట్లు సంచరిస్తుంది. ఈ ప్రపంచంలో మూసుకుని మరో లోకంలో తెరచుకున్న నేత్రాలు ఆమెవి. "కాని.... కాని.... సూర్యుడు, చంద్రుడూ - ఎప్పుడూ చూస్తుంటాను, కాని ప్రతిసారి ఎందుకో క్రొత్తగా కనబడతాయి. మంచినీళ్ళు రోజూ త్రాగుతా. కాని ప్రతిసారి ఎంతో క్రొత్తగా వుంటాయి....నక్షత్రాలు...."

నేను వెడతానని లేచాను.

"నక్షత్రాలు.... ఉ.... మంచిది...." అమెని గురించి ఏం కథ వ్రాయనూ?

* * * *

క్రితంసారి మేం కలుసుకుని నాలుగేండ్ల యింది. ఈసారి కుముదంగారి వూరు అద్దికోసమే వెళ్ళలేదు. వేరే పనుండి వెళ్ళాను, మధ్యాహ్నం రెండుగంటలు దాటింది. నడివేసంగి ఎండ నన్ను నీడకి తరిమింది. పోస్టాఫీసు ప్రక్కనున్న మామయ్యగారింటికి ఎప్పుడూ దొడ్డిదోవన వెళ్లడం అలవాటు చొప్పున ఆనాడు కూడా అల్లాగే వెళ్ళాను.

కుముదం మండువాలో గచ్చుమీద కూర్చుని అనాసపండు తరిగి వెండిపళ్ళెంలో వేస్తోంది. నారింజపండురంగు చీర కట్టుకుంది; నన్ను చూచి లేవడంలో పమిటజారింది. నాకర్థమైనట్లు నవ్వి వెనక్కి తిరిగి లోపలికెళ్ళి వొక కుర్చీ అమిర్చి కూచోమని సంజ్ఞచేసింది. నే చూసిన దృశ్యం నా కిదివరకులేని కొత్త చనువునిచ్చిందని వొప్పుకోకతప్పదు. మనిషి శీలానికి వ్యక్తిత్వానికి మొహం వొక్కటే నిదర్శనం కాదనుకుంటాను. కొన్ని ఆకస్మిక దృశ్యాలు, జీవితకాలం పరిశీలించినా బోధపడని అంతరంగికాలని తేటపరుస్తాయి కాబోలు.

కుర్చీలో కూర్చోగానే పటుక్కుమంది పాతకుర్చీ. లేచి సర్దుకున్నాను. కుముదం పమిటని పళ్ళమధ్య బిగించి నవ్వుని ఆపుకుంటోంది.

"అన్ని కుర్చీలమాదిరి నిన్ను భరించి వూరుకోక, విరిగి, కొత్త దారితీసింది చూచావా! దాని కథ వ్రాయవూ?...." అంది. నాకూ నవ్వొచ్చింది. చాపమీద కూర్చుని స్తంభానికి జారబడ్డాను.

"మనం కలుసుకుని దగ్గరదగ్గర నాలుగేళ్ళయింది. తెలుసా? నే నివన్నీ మరిచిపొయ్యాను. నీకింకా ఎట్లా జ్ఞాపకం వుందీ?" అన్నా ప్రశార్థకంగా.

"ఏమో, నువ్వు జీవితాన్ని పరిశీలిస్తావు. నేను అనుభవిస్తాను ఏమో" అన్నది.

ఆమెకి జీవితం అనుభవించడం అంటే ఏమిటో తెలీదని నా నమ్మకం. కాలం ఆమెపై ఎట్లాంటి మార్పూ తేలేకపోయింది. ఇదివరకు చూసినప్పటికంటె ఈసారి ఎక్కువ ఛలాకీ, యవ్వనోద్రేకం చూపగలిగింది. ఆమెలో ఆకర్షణీయమైంది. ఎడతెగని యవ్వనమేమోననిపిస్తుంది. యవ్వనం ఒక్కసారి తనశక్తిని ప్రకటించకుండా, నిలిపి నిలిపి ప్రజ్వలించినట్లుగా గోచరిస్తుంది.* కొన్ని ఉపమానాలు మన నాగరిక సాంప్రదాయాలకి విరుద్ధమని జంకుతున్నాగాని, లేకపోతే ఆమె శరీరాన్ని గుఱ్ఱంపిల్ల కదలికలోని లావణ్యంతో పోల్చొచ్చు. లేడి గంతులో శృంగారం వుంది కాని, బలంలేదు. కుక్కపిల్ల గంతులో కొంటెతనం

* గుఱ్ఱంపిల్ల ఉపమానం సంప్రదాయానికి విరుద్ధం కాదు. వాల్మీకి రామాయణంలో వుంది.

వుందికాని శక్తి లేదు. మేకపిల్ల గంతులో వేగం వుందిగాని మృదుత్వం లేదు. ఇవన్నీ గుఱ్ఱంపిల్ల అలిగిననాడు చేసిన నాట్యంలో వున్నాయి.

"నువ్వూ, మీ ఆయనా కులాసాగా వుంటున్నారా?" అన్నాను. ఏమనడానికి తోచక.

"నీ దయవల్ల."

"ఇంకా నిన్ను గురించి బోలెడు వినాలనుంది."

"నన్ను గురించి వినేందు కేముంది. మాది సామాన్య బ్రతుకు" అంది నీరసంగా.

"అప్పుడే జీవితంపైన విసుగుపుట్టిందా?" అన్నాను.

"ఈ ప్రశ్నలు నన్నింతవరకూ బాధించడంలేదు. నీ మాట చెప్పు ఏం చేస్తున్నావూ? ఎక్కడున్నావూ? ఎల్లా వున్నావూ?...."

మనదేశంలో చదువుకున్న యువకుణ్ణి ఏం చేస్తున్నావూ? – అని అడగడంకంటె ఎక్కువ అపచారం లేదు. పాపం, అల్లా అడిగిన వాళ్ళందరూ మా మేలు కోరేవారే; కాని, దానికి సమాధానం చెప్పడంలో ఉద్యోగం లేని యువకుడు ఎంత బాధపడతాడో పెద్దవాళ్ళకి తెలీదు. ఏమి చెయ్యడంలేదని చెప్పడం నాకు చిన్నతనంగా తోచి "ఏమీలేదు – కథలు వ్రాయడం మొదలుపెట్టాను" అన్నాను.

"నన్ను గురించా?"

నవ్వుకున్నాను. పడుతూ, నడుస్తూ, పడుతూ, చంటిపిల్ల చక్కావచ్చి అర్థంలేకుండా ఏడవడం మొదలెట్టింది. నే నాశ్చర్యపడ్డాను.

"మా పాపాయి. ఇంక రెండు నెల్లకి మూడో ఏడొస్తుంది" అంది కొద్ది గర్వంతో.

"నా కెప్పుడూ చెప్పలేదే? ఈ సంగతే తెలీదు" అని ఆశ్చర్యం దిగమింగుకోలేక పోయాను.

"నీకు తెలియజేసేటందుకు యిందులో ఏం విశేషముంది? ఇది సాధారణంగా అందరికి జరిగేపనేకదా! నీకీ విషయం వేరే నే చెప్పాలా?" అంది. ఆమె అంతవరకూ తన పిల్లని గురించి చెప్పకపోడం చూస్తే నాకు మరీ ఆశ్చర్యం కలిగింది.

"దానికో పాపాయి వుదుతుంది. ఎప్పుడో, ఎక్కడో అది ఎవర్నో ఎక్కడో పెండ్లి చేసుకుంటే దానికి మరో పాపాయి, ఎప్పుడో, ఎక్కడో వుదుతుంది. అలా జరిగిపోతుంది. ఇందులో ఆశ్చర్యపడవల్సిన విశేషం ఏముంది....?"

కుముదంలో మాతృత్వం తాలూకు చిహ్నాలేవీ నాకు కనబడలేదు. పిల్లలని చూసుకుని తల్లులుపడే గర్వం ఆమెలో లేదు. ఆ ప్రశంస ఎత్తాలని ఆమెకు తట్టనేలేదు. ఆమె శరీరపటుత్వాన్ని చూస్తే, ఆమె ఈ పిల్లలని కన్నదా అనిపించింది. పిల్లలూ భర్తా, సంసారం – యివేవీ ఆమె నిజశరీరాన్ని తాకి వంచుకున్నట్లు లేదు.

"నీ పోలికా, వాళ్ళ నాన్న పోలికా?"

"ఏ మో నీకే తెలియాలి."

"నా కెట్లా తెలుస్తుంది? నేను వాళ్ళ నాన్నని చూడనే లేదుగా."

"వీధులో వున్నారు చూడకూడదూ?" వీధులో అరుగుమీద విద్యార్థులతో ఆయన పడుతున్న అవస్థ నాకు వినపడుతునే వుంది. వెళ్ళేటప్పుడు చూడొచ్చు ననుకున్నాను.



కుముదం పిల్లని లోపలికి తీసుకెళ్ళిపోయింది. ఆకులో అనాస ముక్కలుంచి, మంచినీళ్ళు పెట్టింది.

"పాపం, ఎండలో వొచ్చావు. నీ ముఖం మాడిపోయింది."

"నిజంగా?"

"మనం పెద్దవాళ్ళమైపోతున్నాం కదూ?"

"నా మాట తెలీదుకాని, నువ్వు మాత్రం యింకా చిన్నదానవవుతున్నావు" అన్నాను.

"అదీ అబద్ధం. ప్రకృతి విరుద్ధం" కొంతసేపు ఎవ్వరం మాట్లాడ లేదు. ఎందుకో కొన్ని కొన్ని సమయాలలో ఆమెతో మాట్లాడుతున్నప్పుడు, బుర్ర ఖాళీ ఐపోతుంది. సిగరెట్టు పీలుస్తూ, చీట్లాడుకుంటున్న సమయంలో అమాంతం గదిలోకి చిరతపులి వొచ్చినప్పుడు, బుర్ర ఎట్లాపని చెయ్యదో, అట్లాగే అమెతో సంభాషణ.

"దేశంలో సంతానం ఎక్కువైపోతున్నారు. యిట్లా పది సంవత్సరాలు జరిగిందంటే తినేందుకు తిండి వుండదంటున్నారు సాంఖ్య శాస్త్రవేత్తలు, తెలుసా?" అన్నాను.

"అది నాకు తెలీదు. మనం ప్రకృతికి దాస్యం చెయ్యడం తప్పదు. దాస్యం నేను సహించలేను. కాని అది తప్పదనుకుంటాను నేను ఎదురు తిరగలేక కాదు; నాకదిష్టంలేదు. జీవితానికి తలవొగ్గి, ప్రపంచాన్ని అంగీకరిస్తాను."

"అదే పొరబాటు. అంగీకారం ఆదర్శాలు లేని, వ్యర్థజీవి విముఖత్వం."

"కావొచ్చు. సృష్టిలో నేనెంతో అల్పురాలనని తోటివాడవైన నీకే తోచినప్పుడు సృష్టిముందు నేనేం తిరుగుబాటు చెయ్యగలను చెప్పు?"

వెడతానని లేచాను.

"అద్దె తీసుకురానా?" అంది. "నేను దానికోసం రాలేదు. మనియార్డరు చెయ్యొచ్చు."

పాపిష్టి డబ్బుని ఆమె చేతులు తాకటం నా కిష్టంలేదు. ఆమె భర్తని చూడడం కూడా మరచి, బైటకి నడిచాను. నన్ను కుముదం వెనక్కిపిలుస్తుందనుకున్నా, అట్లా పిలవలేదు. నా వెనకాల దొడ్డితలుపు గడియవేసిన చప్పుడు వినిపించింది.

కుముదాన్ని గురించి ఏం కథ వ్రాయనూ?

* * * *

ఆరు సంవత్సరాలు గడిచాయి. రెండో ప్రపంచ సంగ్రామం ప్రారంభమైంది. అప్పటికి నా చదువు, ఉద్యోగయత్నాలు పూర్తయ్యాయి – వొక్క యత్నమూ ఫలించలేదు. మా మామయ్య నా కోసం పెట్టిన డబ్బు ఖర్చంతా వృథా ఐంది. పైగా, ఆయనా, మా అత్తయ్యా, ఇండియా అంతా యాత్రచేసి రావడంవల్ల ప్రావిడెంట్ ఫండంతా తరిగిపోయింది. నిరుద్యోగ సమస్యను గురించి బోలెడు కథలు వ్రాశాను. సమస్య పరిష్కారం కాలేదు; ఆంగ్లంలో యీ సమస్యను పరిష్కరించడానికి కొన్ని సలహాలిస్తూ వ్యాసాలు వ్రాశాను; ఎవరూ వాటిని గుర్తించినట్లులేదు. కొన్ని సమయాలలో రాజకీయోద్యమంలో దిగి జైలు కెడదా మనిపించేది. అప్పుడు భుక్తికి లోటుండదు. కీర్తి దక్కుతుంది – పైగా

జైలులో నే తలపెట్టిన మహత్తర గ్రంథాన్ని రచించడానికి మంచి అవకాశాలుంటాయి. కాని రాజకీయాలలో దిగడం ఎట్లా? 'ఫరవాలేదురా అబ్బీ, యుద్ధం వచ్చింది. దేవుడి ధర్మమా అంటూ నీ కేదో వుద్యోగం దొరక్కపోదు' అని మామయ్య ఓదార్చేవాడు.*

"నాకు నచ్చిన ఉద్యోగం ఒకటి ఖాళీ వచ్చింది మామయ్యా. దరఖాస్తుకి, ఇంటర్వ్యూకి వో ఏభై రూకలుంటే నాకు లభించొచ్చు" వెంటనే మామయ్యకి వో భావం తట్టింది.

"ఒరే! కుముదంగారింటికెళ్ళి, రెండునెల్ల అద్ది, ముందుగా యిస్తారేమో కనుక్కురా" అని నన్ను సాగనంపాడు.

సూర్యుడు పడమటింట్లో గృహప్రవేశం అవగానే తలుపువేసి, కిటికి కర్టెన్లు దగ్గరగా లాగడానికి సిద్ధపడినట్లు, మేఘాలు చురుగ్గా విహరిస్తున్నాయి. కుముదంగారి దొడ్లో ఎన్నో యిదివరకు చూడని కొత్త మొక్కలు, చెట్లు వున్నాయి. కొబ్బరిచెట్లు మేఘాలతో ఏకీభవిస్తున్నట్లు ఆకాశంలోకి పొడుచుకుని ఆడిపోతున్నాయి. జామచెట్టు వార్ధక్యం వచ్చిన దాని మల్లే ముడుచుకుంది. ఆ అల్ప ప్రకృతిలో వక్కటీ నారాక గుర్తించినట్లులేదు? చెట్ల కొమ్మలకి ఉయ్యాల అమర్చబడి వుంది. నూతి పళ్ళెం వేపునుంచి వో పాపాయి పాకుతూ వస్తున్నాడు. వాడితో ఏదో మాట్లాడాను; వాడికేమీ అర్థంకాక, జీవిత రహస్యం తెలుసుకోలేకపోయిన వేదాంతిలా, నిరర్థకపు ఏడ్పు మొదలుపెట్టాడు. చెట్ల గుబురుమధ్య కుముదం మేఘాల మధ్య నక్షత్రంలా కదిలింది. నక్షత్రబృందంలోంచి విడిపోయిన పిల్ల కాంతిలా మరో చిన్నపిల్ల పరుగులెత్తింది. కుముదం చేతిలో గునపాన్ని గిరవాటెట్టి పమిటని పళ్ళమధ్య బిగించి పైకిలాగి, చేతులో వున్న మొక్కని నాముందు పడేసింది.

"చూశావా, యీ ఆకుని ఎట్లా తినేస్తోందో యీ చిత్రమైన పురుగు? ఈ పురుగు అందమైనదే, మొక్కా అందమైనదే. అందాన్ని చూచి అందం నోర్చులేదుకదూ?

నే నేమీ మాట్లాడలేదు.

"నువ్వొచ్చి ఎంతసేపయింది? పిలవలేక పొయ్యావా? లేక నా పేరే మరచి పొయ్యావా?" అంది.

"లేదు లేదు - యీ తోటని చూస్తూ ఆశ్చర్యపడుతున్నాను."

"ఇందులో ఆశ్చర్యం ఏముంది? విత్తనంవేసి, నీళ్ళు పోస్తే మొక్క మొలుస్తోంది. ఇవన్నీ సాధారణమైన మొక్కలు" కొంటెగా నవ్వింది.

"మా పాపని చూశావా, పెద్దదైంది. నువ్వింక సంబంధాలు చూసి పెట్టే సమయం వస్తోంది. వాడు మా రెండోవాడు. ప్రకృతంటే పడదు. అన్నింటినీ ధ్వంసం చేస్తాడు. వీడు మా మూడోవాడు - వీడికి నాలా ప్రపంచంతో నిమిత్తంలేదు - పాపా! బకెట్ తీసుకురా...."

అమ్మాయి బకెట్ తీసుకొచ్చింది. కుముదం చిన్నప్పుడు జామపండు తింటున్న దృశ్యం జ్ఞాపకం వచ్చింది.

---

* రెండో ప్రపంచ సంగ్రామం ముగియగానే వ్రాసిన కథ యిది.



"కొంచెం నీళ్ళు తోడిపెట్టు, చేతులు కడుక్కుంటా" అంది.

నేను తోడాను, బకెట్‌లో సగం నీళ్ళు నూతులోనే పడిపోయాయి.

"నీళ్ళు తోడడం తెలియకపోతే ఎట్లా? నీ భార్య జైటుంటే నువ్వే తోడుకోవాలి."

"నాకింకా పెండ్లి కాలేదు."

నమ్మలేనట్లు చూసి, మౌనంలో పడింది.

"నాకు ఉద్యోగంలేదు. ఎందుకు పెండ్లి?" అని స్వగతంలా చెప్పుకున్నాను.

కుముదం నామాట వినిపించుకోలేదు. చీరని పాదాల పైకితీసింది. ఆమె శరీరానికి మాతృత్వం పరిపూర్ణత నిచ్చింది. వయసు మొహానికీ వైరాగ్యాన్నిచ్చినా, వార్ధక్యాన్నివ్వలేక పోయింది. మట్టిలో నీళ్ళు కలిపిన వింత సువాసన నన్నావరించింది. మొహాన్ని పమిటతో తుడుచుకుంది. తడిసిన పమిట పర్వతశిఖరానికి ఎగబ్రాకేవాడికి పట్టుదొరికినట్లు, వక్షాన్ని అదిమిపట్టుకుంది. సూర్యుడి కడసారి కిరణం, లోయలో నీడని ఒక్కసారి వెలిగించి మాయమైంది. సంధ్య అందాన్ని అనుభవించాలన్నవాడు కుముదంతో వుండాలి. సంధ్యలో నే నెన్నడూ చూడని ప్రత్యేక శోభని ఆనాడు చూడగలిగాను.

"దా, ఉయ్యాలమీద కూర్చో - వెనక విరిగిన కుర్చీ యింతవరకూ బాగు చేయించనేలేదు....ఏదో వొకటి వొస్తునే వుంటుంది. తీరికలేదు."

కుముదం గడ్డిలో కూర్చుంది. అమ్మాయి, వేదాంతిని ఎత్తుకొని లోపలి కెళ్ళింది. రెండోవాడు, ధ్వంసంచేసేందుకు మొక్కలు లేవన్నట్లు, గడ్డినే దిమ్మిశాలా మర్దిస్తున్నాడు.

"మనం కలుసుకుని చాలారోజులైంది తెలుసా?

"ఆహా, దగ్గరగా ఆరుసంవత్సరాలైంది."

"నువ్వు చాలా మారిపోయావు."

మంచికా చెడుకా అని అడుగుదా మనుకున్నాను. నన్ను మాట్లాడ నీకుండానే - "ఎక్క డెక్కడి కెళ్ళిందీ, ఏం చేస్తున్నదీ - అంతా చెప్పు నిన్ను గురించి" అంది.

"ఉత్తర హిందూస్థానం వెళ్ళా - ఎక్కడా మంచి ఉద్యోగం దొరకలేదు. మామూలుగా ఇండియాలో మనిషి ఇరవై ఎనిమిదేండ్ల కంటే ఎక్కువకాలం జీవించడంటారు సాంఖ్య శాస్త్రకారులు. దాని ప్రకారం నేను నాలుగేండ్ల క్రితమే చనిపోయి వుండాల్సింది. అల్పాయువుగలవాళ్ళు సుఖంగా వుండగలరు మన సంఘంలో."

కుముదం సానుభూతిచూపి, జాలిపడుతుందని నా ఉద్దేశాన్ని ఎంతో కసితో భయంకరంగా ప్రకటించానేమో!

"ఉద్యోగం లేకపోతేనేం? దానికోసం జీవితాన్ని తిట్టొచ్చా! ఉద్యోగంలో పడ్డావంటే, అదేలోకం, మరి ప్రపంచంతో సంబంధం వుండదు. ఎవరికో బానిసవై స్వేచ్ఛ పోగొట్టు కుంటావు. ఆడాళ్ళకి వుద్యోగంచేసే బాధలేకపోవడం ఎంతో మెరుగు"

ఉద్యోగం చెయ్యనందుకు నన్ను అందర్లా అక్షేపిస్తూ తిట్టకుండా, మెచ్చుకున్నందుకు నేను కుముదాన్ని కొంత గౌరవించాను.

"పాశ్చాత్యదేశాలలో స్త్రీలు, పొట్టకూటికోసం భర్తలకు మన వాళ్ళల్లా అమ్ముడుపోరు" అన్నాను. అప్రయత్నంగా రెండు గడ్డిపువ్వులను తెంచి జుట్టులో అమర్చుకుంది.

"మనకీ ప్రపంచంలో ఎవరో ఒకరికి దాస్యం చెయ్యడం తప్పదేమో ననిపిస్తుంది. దేవుడు సైతం భక్తుడికి దాసుడు కావడంలేదు."

"నా కింతవరకూ ఉద్యోగం యివ్వని యీ సంఘాన్ని గౌరవించి, ఎందుకు సేవ చెయ్యాలో నాకు తెలీడంలేదు."

"నీకు ఉద్యోగం లేకుండావుంటే నువ్వు సుఖపడతావు. ఐనా నీ పిచ్చికాకపోతే, నీకు ఉద్యోగం ఎవరో యిచ్చేదేమిటి? నువ్వేదో గొప్ప కార్యం చెయ్యడానికి పుట్టానని వెనక చెప్పావు అది నేను నమ్ముతాను. అది చెయ్యి. స్వతంత్రించి, నచ్చినపని చెయ్యడమే మంచిది. నేను దాస్యం సహించలేను."

"దాస్యంలేకుండా, ప్రేమని సాధించటం ఎట్లా?" ఈ ప్రశ్న ఎందుకడిగానో నాకు తెలీదు,

"ఔను, మనుష్యులతో చేసే ప్రేమలో దాస్యంవుంది. సంసారంలో బంధనాలు ప్రేమలో బంధనాలు; అసలు పుట్టడమే సృష్టికి దాస్యం వీటికి దూరంగా వుంటే మంచిది."

కుముదం, హృదయానికి దగ్గరగావుండే విషయాలని గురించి ముచ్చటిస్తుంటే వినడం అదే మొదటిసారి. నేను అనుకున్నంతటి అమాయకురాలు కాదని స్పష్టమైంది.

"ప్రపంచంతో నిమిత్తం లేకపోతే, అసలు గొప్పకార్యం సాధించటం దేనికి?"

"సాధించటంతో మనుషులకు చేసే దాస్యం నుండి విముక్తి దొరుకుతుంది. కాబట్టి, ప్రపంచాన్ని మనం ఏదేనా కోరి, ఆశిస్తే దాన్ని యివ్వదు. మనం దేన్నీ ఆశించకుండా, దూరంగా వుండి చెయ్యగలిగినపని చేస్తుంటే ప్రపంచం మన పాదాలముందు వాల్తుంది."

కుముదం, స్వతంత్రాన్ని అంత కాంక్షిస్తుందని నే నెప్పుడూ అనుకోలేదు. భర్త, పిల్లలు, సంసారం, ఉద్యోగం - తుదకి ప్రేమ - యివన్నీ కూడా దాస్యమే నంటుంది. స్వతంత్రం లేని బ్రదుకు వృధాట. ఒక విలువని అంతగా కోరినప్పుడు, దాన్ని వారు పొందలేకపోతే, నా హృదయం బాధతో క్రుంగిపోతుంది. జనసామాన్యానికి స్వేచ్ఛనిస్తే దుర్వినియోగం చేస్తారు. దాని విలువ తెలియనివాళ్ళకి అదివ్వడం మహాపాపం కాని, దేన్నీ వుపయోగించుకోకుండా, కేవలం విలువల ఆరాధనతో తృప్తిపడే కుముదంలాంటి వ్యక్తులకి స్వేచ్ఛ లేకపోవడం ప్రపంచానికి అనర్థం.

"నేను నువ్వైతే ఏం చేద్దునో తెలుసా? నదీ తీరాన్ని చిన్న తాటాకుపాక కట్టుకుంటాను. అందులో కూర్చుని, ఊరికే చదువు నేర్పుతానని చాటింపు వేయిస్తాను. మొదట ఏ పదిమంది పొలంకాపులో వొస్తారు. సాయంత్రం, వాళ్ళకి బోధించడం మొదలెడతాను. ఇరుగు పొరుగునుంచి అనేకమంది కర్షకులు, కూలివాండ్లూ చదువుకోసం వస్తారు. ఉత్త చేతుల్తో రాకుండా, ఒకరు వుప్పూ, చింతపండు, ఒకరు పాలు - ఆల్లా నాక్కావల్సినవాటిని వాళ్ళే సిద్ధంచేస్తారు. వారు నా శిష్యబృందం. వాళ్ళ కష్టసుఖాలు పంచుకుంటూ; వారి తగాదాలకి తీర్పుచెపుతూ - అంతే; అప్పుడు నా జీవితం వృథా అనుకోను."

సూర్యుడు అస్తమించగా అలిసిన తన పరివారం పడమటిలోయలో సేద తీర్చుకుంటున్నట్లు వెలుగు ఛాయలు కరుగుతున్నాయి. ఓపికలేక కదలలేకపోయిన



మేఘద్వయం. దక్షిణ గాలి పిలుపుకి కదలిపోతున్నాయి. ఇది నా రాజ్యం అన్నట్లు వొంటి నక్షత్రం కన్నుమీటింది. ప్రకృతిలో నిశీధకీటకాలు తన్మయరొద సాగించాయి. మా సంభాషణ విని విని విసుగెత్తిన పుష్పాలు చీకటి ప్రశాంతంలో ముడుచుకున్నాయి. తూర్పు ఆకాశం జడవిప్పుకుంది. కుముదం తలలో తెల్లవెంద్రుక మెరిసింది.

"తెల్ల వెంద్రుక" అన్నా, వున్నచోట వేలు మెదుపుతూ.

"ఎన్నాళ్ళని యవ్వనానికి శరీరం దాస్యం చేస్తుంది? దానిదోవ అది చూచుకుంటుంది."

నా కళ్ళు చెప్పలేని విచారంతో తడిసినై. నేను అద్దె మాట అడగడం మరిచి పొయ్యాను. ఆ తన్మయతతో బరువెక్కిన వాతావరణాన్ని డబ్బు ప్రశంసతో పాడుచెయ్యడం నాకిష్టంలేకపోయింది.

వెడతానని లేచా; మంచిదంది; పోనీ, యీ రాత్రి యిక్కడుండి వెళ్ళకూడదా అంటుందనుకున్నా. కుముదానికి మర్యాదంటే ఏమిటో తెలీదు.

* * * *

మరి నాలుగు సంవత్సరాలు గడిచినై; యుద్ధం సాగుతోంది. నాకు మాత్రం ఉద్యోగం చిక్కలేదు. నేను దాన్ని గురించి విచారించే రోజులు వెళ్ళిపోయాయి.

రోజులు గడిచిపోతున్నాయి. నా తిండికి ఎట్లాంటి లోపమూ రాలేదు. వస్తున్న రోజు ఒకటికూడా లేదు. దుబారా ఖర్చుకి నాకే అలవాట్లు లేవు. సిగరెట్లు కాల్చను; సినిమాలకెళ్ళను; పుస్తకాలు కొనుక్కోను. అవంటే యిష్టంలేకకాదు. అవి నా అందుబాటులో లేవు. మా మామయ్య చనిపోయి ఆరునెలలైంది. మా అత్త తప్ప నాకు 'నా' అన్నవాళ్ళు ఎవ్వరూ లేరు. ఇది కొంత మేలే. నామీద అధికారం చలాయించేటందుకు ఒక్కరూ లేరు. నాకీ సంఘం తిండిపెట్టనక్కరలేదు. నా బ్రదుకు నన్ను బ్రతకనిస్తేచాలు. మా అత్తయ్య వున్న యింటికి అద్దె యిచ్చుకోలేకపోతోంది. తుదకి నిశ్చయించుకుంది. సొంత యింట్లోకెళ్ళి కాపరంపెట్టడానికి, ఖాళీచేయించే యేర్పాట్లకి నన్ను పంపింది.

ఆనాడు అదివారం. రాత్రి ఎనిమిది దాటింది. సన్నచంద్రుడు పల్చటి మేఘం వెనక దాక్కున్నాడు. కుముదంగారి యింట్లో దొడ్లో అంతా నిశ్శబ్దం, వీధులోకొచ్చాను. తలుపు తాళంవేసి ఉంది. ఎక్కడికెళ్ళారో నాకు బోధపడలేదు. కాసేపు అరుగుమీద కూర్చున్నా. తెలిసినవాళ్ళని కనుక్కుందామని వీధులోకి నడిచాను. అప్రయత్నంగా బజార్లోకి వెళ్ళాను. కిల్లీ దుకాణం ముందు బల్లమీద కుముదం పెద్దకూతురు పాపాయి నెత్తుకొని కూర్చుంది. నన్ను కేకేసింది.

"మా అఖరు చెల్లాయిని చూశారా? నాలుగోది - దీన్ని స్వరాజ్యం అని పిలుస్తుంది. మా అమ్మ.... చూడండి. వూ ఏడుస్తుంది.... ఊరుకో నా చిట్టితల్లీ."

"ఇట్లా యిక్కడెందుకున్నావ్? మీ అమ్మ ఎక్కడ?

"మా అమ్మ ఆస్పత్రిలో వుంది. ఇది ఏడుస్తుంటే ఆడించడానికి బైటికి తీసుకొచ్చాను. మా నాన్న హోటలికెళ్ళాడు."

స్వరాజ్యాన్ని భుజాన్ని వేసుకుని హాస్పిటల్‌కి వెళ్ళాం. కుముదం మంచంపై పడుకుంది.. పైన తెల్లటి గుడ్డ కప్పివుంది. చిన్నబల్ల మంచం దగ్గరగా లాగి కూర్చున్నాను.

"ఏం జబ్బు?"

"న్యూమోనియా."

న్యూమోనియా అంత ప్రమాదకరమైన వ్యాధని నా కంతవరకూ తెలియదు. మాట్లాడేటందుకు ఏమీ కనుపించక, దిగులుగా కూర్చున్నాను. కుముదం నీరసంగా నవ్వడానికి యత్నించింది. మొహం మెలికలు తిరిగింది – పెదవులు పవిత్రంగా వొణికాయి.

"నన్ను గురించి కథవ్రాయవూ?" అంది. నేనేం చెప్పనూ?

"ఈ జబ్బు విషయం నాకు తెలీనేతెలీదు. పోనీ వో వుత్తరంముక్క వ్రాయించ కూడదా? డాక్టర్లు ఏమంటున్నారు?"

"జబ్బు చెయ్యడం సాధారణమైంది. పదిమందితోనూ చెప్పుకునేందుకు అందులో ఏం విశేషముంది? ఫరవాలేదంటున్నారు డాక్టర్లు – కాని వాళ్ళకేం తెలుసు?" అని కళ్ళు మూసింది.

నా కక్కడి నుంచి వెళ్ళిపోవాలనిపించింది. ఏదో చెప్పాలని వుంది, కాని నోరాదదు. నా శరీరం వొణికిపోతోంది. అనుకోకుండా, నా చెయ్యి ఆమె చేతిపైన ఆనించబొయ్యాను. అది వేలుకి వుంగరం వున్న చెయ్యి. వెంటనే చేతిని లాగేసుకుని తెల్లదుప్పటిలో దాచేసుకుంది.

"నువ్వెందుకు పెండ్లి చేసుకోలేదో నాకు తెలుసు – నాకోసం."

అంటూ మళ్ళా కళ్ళు మూసింది. నా గుండె స్థూలత్వాని పోగొట్టుకుని ద్రవంగా విడిపోయి, దోవతెలియక తిరుగుతూన్న రక్తనాళాలగుండా, వుజ్వలవేగంతో ప్రవహిస్తూంది. కన్నీటిని నా వేళ్ళతో తొలగించుకొన్నాను. ఆమె నిశ్చల శరీరంపై నా కన్నీరు పడి మలినం చెయ్యడం పాపం అనిపించింది. మొహాన్ని పక్కకు తిప్పేసుకున్నాను. కిటికీ అద్దంలోనుంచి నిశీధి నల్లత్రాచులా లోకాన్ని అల్లుకుంటోంది.

"నీ స్థితిచూస్తే నా కెంతో బాధగా వుంది" అన్నా కన్నీరు దిగమింగుకుని.

"నాకు నిర్విచారం.... ఈ ప్రపంచం నాద్వైతేగా విచారానికి. నువ్వు మాత్రం...." కళ్ళుమూసి మరి విప్పలేదు. ఈ లోకంలో మూసుకుని మరో లోకంలో తెరుచుకున్న నేత్రాలు కుముదానివి.

* * * *

ఆత్మని దిగవిడిచి వచ్చిన వ్యక్తి మళ్ళా దానిలోకే చేరుకుంది. చెట్లు, నదులు, మేఘాలు, చీకటి వెలుగుల సమ్మేళనంతో గిరగిరా తిరిగిపోతున్న విశ్వంలో కలిసిపోయింది.

నిశీథిలోకి నడిచి వెళ్ళాను. మహత్తర అనుభవం సంభవించినప్పుడు, తార్కిక జ్ఞానం, విమర్శనాబుద్ధి పనిచెయ్యవు. ఇంద్రియాలు శరీరాన్ని వూపి, కొత్త జన్మనిస్తాయి. భావోద్రేకంలో నిమగ్నుడై చైతన్య ప్రవాహంలో కొట్టుకుపోతున్న వ్యక్తి, ఒక్కసారి సృష్టి రహస్యాన్ని, మెరుపులా ఛేదించి మరో అవతారం దాలుస్తాడు. చచ్చి బ్రతకడంలాంటిది. ఆ అనుభవం.



కుముదం నా వివాహాన్ని గురించి చెప్పిన కడసారి మాటలు నాలో అథోలోకాన్ని త్రవ్వి దాని దాపరికాన్ని నాకళ్ళముందు ప్రదర్శించినట్లయింది. ఆమెకోసం పెండ్లి చేసుకోలేదట! మానసిక శాస్త్రజ్ఞులు, మానవుడి బుర్రలో అథోలోకం వుందంటారు. అక్కడ అతని రహస్యమైన కోర్కెలు, బైట చెప్పుకోలేని తీరని వాంఛలు అడవిమృగాలలా తిరుగుతాయట. అవి అన్ని సమయాలలోనూ బయటికి రాకుండా బుద్ధి కాపలా కాస్తుంది. అవి బైటికి రాలేకపోయినప్పటికీ, ఎప్పుడో, నిద్రలోనో, బలహీనమైన స్వప్నావస్థలోనో, గర్జించి వాటి వునికిని బాహ్యప్రపంచానికి వెల్లడిస్తాయట. ఇంతకాలం నా బుద్ధి వాటిని కట్టేసింది. ఆనాడు ఆమె చెయ్యిపైన చెయ్యివేసినప్పుడు బుద్ధిని తొలిగించి వాంఛలు బైటికొచ్చినట్లు కుముదం గ్రహించి, తనచేతిని లోపల దాచుకున్నట్లు వాటిని వెనక్కినెట్టి నోరునొక్కింది. ఆమెలో ఏమీ విశేషంలేదని సమాధానపరుచుకున్నా, ప్రాకృతికమైన ఆకర్షణ లోపల దాగివుండి, నా జీవితంపై అంత ఒత్తిడి కలిగించినందుకు ఆశ్చర్యపడ్డాను.

తననిగురించి కథ వ్రాయమంది. ఆరుగంటల పరిచయంతో, ఆరువందల మాటలతో, నా ప్రపంచాన్ని తలక్రిందులుచేసి, నా జీవిత పరమావధినే తారుమారుచేసిన కుముదాన్ని గురించి ఏం కథ వ్రాయను?

రచనాకాలం: **1946**

ప్రచురణ: ఆంధ్రశిల్పి - **1946**, ఆగస్టు